

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

విజయవాడ ఆదివారం 20-09-2026 సంపుటి: 02 సంచిక : 80 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Sunday, 20-09-2026 Volume :02 Issue: 80 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani



Contact Number 9059328777

# కెరీర్ క్లోజనుకున్నా!

- మా నిపుణ ఏజెంట్లు చైనాకు చిక్కారు
- 15 రోజులైనా ఆచూకీ లభించలేదు
- ఆ సందర్భంలో చాలా ఆందోళన చెందాను
- పాత జ్ఞాపకాలు గుర్తుచేసిన దోవల్
- అద్భుత భవిష్యత్ వైపు భారత్ పరుగులు
- యువతకు శ్రీరాముడే స్ఫూర్తి
- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ప్రసంగం

గూఢచర్య మిషన్లలో ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదేనని భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. తన కెరీర్ ప్రారంభంలో చైనా సైన్యం తమ బృందాన్ని పట్టుకోవడంతో ఉద్యోగ జీవితం ముగిసిపోయిందని భావించిన ఓ ఘటనను ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో విద్యార్థులతో పంచుకున్నారు. ఆ అనుభవం తనకు జీవితాంతం ఉపయోగపడే కీలక పాఠాన్ని నేర్పిందని తెలిపారు. యువత శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.







## భూటాన్‌లో భూకంపం

- ఈశాన్య భూటాన్‌లో ప్రకంపనలు.. అసోంలోనూ ప్రభావం
- సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించినట్లు ఎన్‌సీఎస్ వెల్లడి
- గ్యెల్ఫోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం
- 5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించిన అధికారులు
- సరిహద్దు అసోంలోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపింపు
- భూటాన్, అసోంలో ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడి
- మూడు రోజుల క్రితం నేపాల్‌లోనూ 4.5 తీవ్రతతో భూకంపం

# నా జీవితం ధన్యం

## విశాఖలో పేదలకు పట్టాభిషేకం

- 28,445 కుటుంబాలకు ఇంటిపై సంపూర్ణ హక్కు
- రూ.8,874 కోట్ల విలువైన భూమికి పట్టాలు.. 399 ఎకరాల క్రమబద్ధీకరణ
- 40 ఏళ్ల అనిశ్చితికి తెర.. ఇక భయం లేదు..
- మరో 22 వేల కుటుంబాలకు త్వరలో పట్టాలు
- పోలవరం జలాలతో విశాఖకు శాశ్వత తాగునీటి పరిష్కారం
- పట్టాల పంపిణీ కాదు.. ఆత్మగౌరవానికి పట్టాభిషేకం
- విశాఖ ఎయిర్ల్యాండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నాయుడు

ఏపీ బ్యూరో


**'కూడు.. గూడు.. గుడ్డ..' ఇదే మా విధానం..**

పేదలకు పక్కా ఇల్లు ఉండాలన్న స్ఫూర్తితో ఎన్టీఆర్ 40 ఏళ్ల క్రితమే శ్రీకారం చుట్టారని సీఎం గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తాను, పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ విశాఖలో ఇచ్చిన హామీని నేడు అమలు చేసి చూపిస్తున్నామని తెలిపారు. "ప్రతి మనిషికీ సొంతిల్లు ఉండాలనేది కల. మీరు నిర్మించుకున్న ఇంటిపై హక్కు లేదనే ఆవేదన ఇన్నాళ్లూ ఉంది. దశాబ్దాల బాధకు, అనిశ్చితికి నేటి పట్టాభిషేకంతో ముగింపు పలుకుతున్నాం" అని చంద్రబాబు చెప్పారు.

**విలువైన భూమిని అమ్ముకోవద్దు..**

"కన్వేయన్స్ డీడ్లు ఇస్తున్నాం. రిజిస్ట్రేషన్ ధర ప్రకారం ఈ భూమి విలువ రూ.8,874 కోట్లు. మార్కెట్ ధర ఇంకా ఎక్కువగా ఉంటుంది. ధర ఎక్కువగా ఉందని మీ విలువైన భూములను అమ్ముకోవద్దు.

-మిగతా 2 లో







## స్టార్టప్‌లే భారత యువత సత్తాకు నిదర్శనం..!

- ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్
- చిన్న నగరాల్లోనూ విస్తరిస్తున్న స్టార్టప్‌ల ప్రస్థానం
- టైర్-2, టైర్-3 నగరాల్లో సగం స్టార్టప్‌లు
- కొత్త కంపెనీలతో యువతకు ఉపాధి అవకాశాలు
- రూ.లక్ష కోట్లతో ఉద్యోగ కల్పనకు ప్రత్యేక పథకం
- తొలిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ.15 వేల ప్రోత్సాహకం
- కొత్త నైపుణ్యాలు, సాంకేతికతపై దృష్టి పెట్టాలన్న ప్రధాని
- 'కర్మయోగి ప్రారంభ్'తో కొత్త ఉద్యోగులకు శిక్షణ

న్యూఢిల్లీ

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

-మిగతా 2 లో




## మనం అత్యంత విధ్వంసకర శక్తిగా మారాలి

- సైన్యానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఆదేశం..!
- మూడు రోజుల పాటు కీలక ఆయుధ కర్మాగారాల్లో కిమ్ పర్యటన
- యుద్ధాన్ని నిరోధించడం, పోరాడటం.. ఆర్టిలరీకి రెండు బాధ్యతలని వెల్లడి
- ఆయుధ తయారీలో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని ఆదేశం
- ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై దృష్టి
- రాకెట్ లాంచర్లు, డ్రోన్ కర్మాగారాలను సందర్శించిన కిమ్
- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ ని విన్యాసాలకు ఉత్తర కొరియా ప్రతిస్పందన
- డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులతో భారీ ఫైర్‌పవర్ విన్యాసం

## సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

- హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పిటిషన్
- రేపు విచారణకు వచ్చే ఛాన్స్

02






## సోమవారం నుంచి పిఠాపురంలో పవన్ పర్యటన

- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,
- రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్సకు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు,
- మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ
- తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

అమరావతి,ఏపీ బ్యూరో,

ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటన ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు,

-మిగతా 2 లో




## కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం..

- భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!
- రష్యా, ఇరాన్‌పై ఆంక్షల బిల్లుకు ట్రంప్ ఆమోదం
- రష్యా చమురు కొనుగోలుదారులపై సుంకాలకు అధ్యక్షుడికి అధికారం
- భారత్, చైనాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం
- రష్యా చమురు, గ్యాస్ కొనుగోళ్లపై ఒత్తిడి పెంచేలా చట్టం
- 'షాడో ఫ్లీట్' నౌకలపైనా ఆంక్షలు విధించే అధికారం
- భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం ఉంటుందని భారత్ హెచ్చరిక

# కూటమి పాలనలో ప్రజలకు భరోసా

- కూటమి ప్రభుత్వంలో భద్రత కల్పిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్య
- వైసీపీ పాలనలో ప్రజలు భయంతో జీవించారన్న నాదెండ్ల
- రెండున్నరేళ్లుగా భద్రత, భరోసా కల్పిస్తున్నామని వెల్లడి
- గత పాలనలో కుదేలైన వ్యవస్థలను చక్కదిద్దుతున్నామని వ్యాఖ్య
- విశాఖలో భూకబ్జాలు, దందాలపై పవన్ పోరాడారని గుర్తుచేసిన మంత్రి
- పవన్‌ను నోవాటెల్‌లో మూడు రోజులు నిర్బంధించారని వెల్లడి
- ఆ తర్వాతే రాజకీయ సమీకరణాల్లో మార్పులు వచ్చాయని వ్యాఖ్య
- టీడీపీతో కలిసి పనిచేసి 2024లో కూటమి అధికారంలోకి వచ్చిందని వెల్లడి
- పేదల ఇళ్లకు సర్వహక్కులతో భరోసా కల్పించామని నాదెండ్ల

విశాఖపట్నం,


'ఐదేళ్ల వైసీపీ పాలనలో భయంతో జీవించిన ప్రజలకు భద్రత, భరోసా కల్పించే విధంగా గడచిన రెండున్నరేళ్లుగా కూటమి ప్రభుత్వ పాలన సాగింది' అని మంత్రి, జనసేన



నాయకుడు నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు పంపిణీ కార్యక్రమంలో సీఎంతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వైసీపీ పాలనలో కుదేలైన అన్ని వ్యవస్థలను కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతూ వస్తుంది.జగన్ పాలనలో విశాఖలో భూకబ్జాలు, దందాలపై ప్రజల బాధలు తెలుసుకునేందుకు వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మూడు రోజుల పాటు నోవాటెల్ హోటల్‌లో నిర్బంధించిన విషయం మీకు తెలుసు. అప్పటి నుంచి రాజకీయ సమీకరణల్లో మార్పులు వచ్చాయి. తెలుగుదేశంతో కలసి పనిచేయడం మొదలైంది. ఆ ప్రయాణంతో 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విశాఖలో దశాబ్దాలుగా పేదలు నివాసం ఉంటున్న ఇళ్లపై సర్వహక్కులు కల్పించడం ద్వారా వారి జీవితాలకు భరోసా వచ్చింది' అని మనోహర్ అభినందించారు.

# భూటాన్‌లో భూకంపం..

**-ఈశాన్య భూటాన్‌లో ప్రకంపనలు.. అసోంలోనూ ప్రభావం**
**-సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించినట్లు ఎన్‌సీఎస్ వెల్లడి**
**-గ్యేల్ఫోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం**
**-5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించిన అధికారులు**
**-ఈశాన్య భూటాన్‌లో పలు ప్రాంతాల్లో ప్రకంపనలు**
**-సరిహద్దు అసోంలోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపింపు**
**-భూటాన్, అసోంలో ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడి**
**-అధికారులు అప్రమత్తంగా ఉన్నారని భూటాన్ ప్రభుత్వ వర్గాల సమాచారం**
**-మూడు రోజుల క్రితం నేపాల్‌లోనూ 4.5 తీవ్రతతో భూకంపం**



ఢిల్లీ: భూటాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. 4.9 తీవ్రతతో భూమి కంపించింది. భూకంపాల తీవ్రతను కొలిచే నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) ఈ వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం.. భూటాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించింది. దీని తీవ్రత 4.9గా నమోదైంది.గ్యేల్ఫోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో, 5 కిలోమీటర్ల లోతున ఈ భూకంప కేంద్రం ఉంది. ఈశాన్య భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ భూకంపం నమోదైంది. అలాగే, సరిహద్దులో ఉన్న అసోంలోనూ కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనాలు వచ్చాయి. దీంతో అనేక ప్రాంతాల్లో భూమి కంపించింది. ఇటు భూటాన్‌లోనూ, అటు అసోంలోనూ నష్టానికి సంబంధించి ఎలాంటి వివరాలు నమోదు కాలేదు. ఈ భూకంపానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి తీవ్ర నష్టం నమోదు కాకపోయినప్పటికీ.. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నట్లు భూటాన్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు మూడు రోజుల క్రితం నేపాల్‌లో కూడా మరోసారి భూకంపం నమోదైన సంగతి తెలిసిందే. నేపాల్‌లో తాజాగా 4.5 తీవ్రతతో భూకంపం నమోదు కాగా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు

## స్టార్టప్‌లే భారత యువత సత్తాకు నిదర్శనం..!

ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికిపైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచిందన్నారు. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఇది భారతదేశ నూతన ఆర్థికవ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా స్టార్టప్‌ల స్థాపనలో కీలకపాత్ర పోషిస్తున్నారని చూపిస్తోందని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ తమతోపాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. ఈ లక్ష్యంతోనే సుమారు రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుందన్నారు. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ.15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతోపాటు కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయని మోదీ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. మీరు మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలని ప్రధాని అన్నారు. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి' ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+గా కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరేవారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని చెప్పారు.

# నా జీవితం ధన్యం

**మొదటి తరువాయి**

ఈ భూమే మీకు భరోసా.. ధైర్యం" అని లబ్ధిదారులకు సీఎం సూచించారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా ప్రజలను రెవెన్యూ సమస్యల నుంచి విముక్తి కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో పేదలు హక్కుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ఇక అలాంటి పరిస్థితి ఉండకూడదన్నారు.

మరో 22 వేల కుటుంబాలకు పట్టాలు..

విశాఖలో ఇంకా 35 కాలనీల్లో సుమారు 10 వేల కుటుంబాలు పట్టాలు లేకుండా నివసిస్తున్నాయని సీఎం తెలిపారు. పంచగ్రామాల పరిధిలో మరో 12,149 కుటుంబాలకు పట్టాలు రావాల్సి ఉందన్నారు. మొత్తంగా సుమారు 22 వేల కుటుంబాలకు వీలైనంత త్వరలో పట్టాలు ఇచ్చి శాశ్వత హక్కు కల్పిస్తామని ప్రకటించారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో నివసిస్తున్న పేదలకు కూడా న్యాయం చేస్తామని తెలిపారు. ప్రతి పేదవాడికీ ఇంటి జాగా, ఆత్మగౌరవం ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు.

ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం..

రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించామని, వచ్చే మార్చిలోగా మరో 5 లక్షలకు పైగా ఇళ్లు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇంటి జాగా ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టించి ప్రతి కుటుంబానికీ శాశ్వత చిరునామా కల్పిస్తామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన తమ ప్రభుత్వ విధానమని, ప్రతి వర్గాన్ని ఆదుకుంటూ ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

విశాఖకు గోదావరి జలాలు.. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం..

ఎల్నినో ప్రభావంతో విశాఖలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని సీఎం తెలిపారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖకు తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. నదుల అనుసంధానంతో రాష్ట్రవ్యాప్తంగా నీటి కొరత లేకుండా చూస్తామన్నారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలు తీసుకొస్తామని, వంశధారకు అనుసంధానిస్తామని తెలిపారు. విశాఖ కాబోయే విశ్వనగరమని, అభివృద్ధి ఫలాల్లో పేదలకు కూడా భాగస్వామ్యం ఉండాలని అన్నారు. గత ప్రభుత్వ పాలనపై సీఎం చంద్రబాబు విమర్శలు చేశారు. రీ-సర్వే పేరుతో భూ సమస్యలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. శుక్రవారం వచ్చిందంటే కూల్చివేతల భయంతో ప్రజలు ఉండేవారని వ్యాఖ్యానించారు. విశాఖను రాజధానిగా చేస్తామని చెప్పి నేరాలు, భూకబ్జాలకు కేంద్రంగా మార్చారని విమర్శించారు.

విశాఖ అభివృద్ధి అన్‌స్టాపబుల్..

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడేందుకు కేంద్రం సహకరించిందని సీఎం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. పరిశ్రమలు, కంపెనీలకు నీరు అందించడంతో పాటు ప్రజలకు తాగునీటి భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. విశాఖను స్వచ్ఛంగా, పచ్చగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 145 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని, తిరుమలలో ఉన్న పచ్చదనం స్థాయిలో విశాఖలోనూ పచ్చదనం పెంచాలని ఆకాంక్షించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో సభికులు పెద్ద ఎత్తున 'జై బాబు' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, డోలా బాలవీరాంజనేయ స్వామి, అచ్చెన్నాయుడు, నారాయణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ భరత్, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# కెరీర్ క్లోజనుకున్నా!

**- మా నిపుణ ఏజెంట్లు చైనాకు చిక్కారు**
**- 15 రోజులైనా ఆచూకీ లభించలేదు**
**- ఆ సందర్భంలో చాలా ఆందోళన చెందాను**
**- పాత జ్ఞాపకాలు గుర్తుచేసిన దోవల్**
**- అద్భుత భవిష్యత్ వైపు భారత్ పరుగులు**
**- యువతకు శ్రీరాముడే స్ఫూర్తి**
**- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ప్రసంగం**



ఢిల్లీ: గూఢచర్య మిషన్లలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయని, ప్రతి నిమిషం గండమేనని భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పేర్కొన్నారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదురైన ఓ అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చైనా సైన్యం తమ బృందాన్ని పట్టుకోవడంతో తన కెరీర్ ఇక ముగిసిపోయిందని భావించానని తెలిపారు. అయితే, ఆ ఘటన తనకు జీవితాంతం ఉపయోగపడే ఓ ముఖ్యమైన పాఠాన్ని నేర్పించిందని చెప్పారు. శనివారం ఉత్తరాఖండ్ లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన ఉద్యోగ జీవితం ప్రారంభంలో ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. సిక్కింలో ఉద్యోగం చేస్తున్న సమయంలో అక్కడ మౌంటైన్ గైడ్ గా పనిచేస్తున్న వ్యక్తి నుంచి మూడు విజయ సూత్రాలను నేర్చుకున్నట్లు చెప్పారు. మనం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకోవడం మొదటి సూత్రం. ఎక్కడికి వెళ్లాలో తెలుసుకోవడం రెండోది. అక్కడికి వెళ్లి తిరిగి ఎలా రావాలో తెలుసుకోవడం మూడోది. ఈ మూడు సూత్రాలూ.. విజయానికి చక్కటి మార్గాలని దోవల్ తెలిపారు. తాను 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు సిక్కింలో ఇంటెలిజెన్స్ బాధ్యతలు నిర్వహించానని, ఆ సమయంలో సిక్కిం భారత్ లో విలీనం అవుతున్న దశలో ఉందని, సరిహద్దు ప్రాంతాల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కదలికలు, కార్యకలాపాలపై సమాచారం సేకరించడం తన బాధ్యతల్లో భాగమని చెప్పారు.

15 రోజులైనా తిరిగిరాని బృందం

ఓసారి సరిహద్దు ప్రాంతానికి సమాచార సేకరణ కోసం తన బృందం వెళ్లింది. ఎనిమిది రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, 15 రోజులైనా ఎలాంటి సమాచారం అందలేదు. వారు బతికే ఉన్నారా? ఏం జరిగింది? అనే ఆందోళన నన్ను తీవ్రంగా వేధించింది. ప్రకృతి విపత్తు లమీ లేనందున, వారి పరిస్థితి ఏమిటన్నది మరింత ఆందోళనకరంగా మారింది. తన బృందాన్ని చైనా సైన్యం పట్టుకుందని ఓ రోజు ప్రధాన కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందింది. కొన్ని రోజుల తర్వాత వారు తిరిగి వచ్చినప్పటికీ, తీవ్రంగా కుంగిపోయిన పరిస్థితిలో ఉన్నారని దోవల్ గుర్తుచేసుకున్నారు.

కెరీర్ ముగిసిపోయిందనుకున్నా..

ఈ ఘటనపై విచారణ ప్రారంభం కావడంతో తన కెరీర్ ముగిసిపోయిందని భావించినట్లు దోవల్ తెలిపారు. తాను వృత్తిపరంగా పెద్ద తప్పు చేశానని భావించినట్లు వివరించారు. అయితే విచారణలో తన తప్పు లేదని తేలింది. ఈ బృందానికి అందించిన మ్యాప్లు, స్కెచ్లలో తప్పులు ఉన్నట్లు కమిటీ గుర్తించింది. దీంతో నాకు క్లీన్చిట్ లభించింది. అయినప్పటికీ ఆ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని దోవల్ చెప్పారు. ఆ సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరోలో తనతో పనిచేసిన ఓ టిబెటన్ షెర్పా చెప్పిన మాటలు తనకు ఎంతో ధైర్యాన్నిచ్చాయని దోవల్ తెలిపారు.

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి..

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు అజిత్ దోవల్ పిలుపునిచ్చారు. రాముడి ధైర్యసాహసాల వల్లే విశ్వామిత్రుడు రాక్షస సంహారానికి ఆయన్ని ఎంచుకున్నారని వివరించారు. భారత్ లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, అద్భుతమైన భవిష్యత్ దిశగా భారత్ పరుగులు తీస్తోందని చెప్పారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా భారత్ కు 2047 వరకు అమృత్ కాలమని అన్నారు. ప్రస్తుతం 4.015 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రానున్న 20 ఏళ్లలో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు.

# కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం..

**భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!**
**రష్యా, ఇరాన్‌పై ఆంక్షల బిల్లుకు ట్రంప్ ఆమోదం**
**రష్యా చమురు కొనుగోలుదారులపై సుంకాలకు అధ్యక్షుడికి అధికారం**
**భారత్, చైనాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం**
**రష్యా చమురు, గ్యాస్ కొనుగోళ్లపై ఒత్తిడి పెంచేలా చట్టం**
**'షాడో ఫ్లీట్' నౌకలపైనా ఆంక్షలు విధించే అధికారం**
**భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం ఉంటుందని భారత్ హెచ్చరిక**



రష్యా, ఇరాన్, చైనా, భారత్ లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దాంతో రష్యా, ఇరాన్ లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాల పై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది.'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. దాంతో భారత్ , చైనా తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చరించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. భద్రతామండలి ఆమోదంలేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టంచేశారు. ఈ చట్టంతో ట్రంప్‌నకు మరిన్ని అధికారాలు లభించినట్లయ్యింది. రష్యా నాయకత్వంపై ఆంక్షలు విధించే అవకాశం దక్కింది. ఇంధన రంగంపై ఆంక్షల విధించవచ్చు. ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరాచేసే నౌకల షాడో ఫ్లీట్‌పైనా ఆంక్షలు విధించడానికి అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేలా ఒత్తిడి తెస్తూ భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించే అధికారం ఉంటుంది.

# సోమవారం నుంచి పిఠాపురంలో పవన్ పర్యటన

**మొదటి తరువాయి**



ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు.

మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో


నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు.

ఈ అభివృద్ధి పనులతో పాటు..

సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# మనం అత్యంత విధ్వంసకర శక్తిగా మారాలి..

**-సైన్యానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఆదేశం..!**
**-మూడు రోజుల పాటు కీలక ఆయుధ కర్మాగారాల్లో కిమ్ పర్యటన**
**-యుద్ధాన్ని నిరోధించడం, పోరాడటం.. ఆర్టిలరీకి రెండు బాధ్యతలని వెల్లడి**
**-ఆయుధ తయారీలో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని ఆదేశం**
**-ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై దృష్టి**
**-రాకెట్ లాంచర్లు, డ్రోన్ కర్మాగారాలను సందర్శించిన కిమ్**
**-అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ విన్యాసాలకు ఉత్తర కొరియా ప్రతిస్పందన**
**-డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులతో భారీ ఫైర్‌పవర్ విన్యాసం**



ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తమ దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ఆదేశాలు జారీచేశారు. తమ ఫిరంగి దళాలు (ఆర్టిలరీ) అత్యంత కేంద్రీకృత, విధ్వంసకర సామర్థ్యాలను కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆయన పలు కీలక ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. ఈ పర్యటన వివరాలను ఉత్తర కొరియా అధికారిక మీడియా (వీవంఖు) వెల్లడించింది.కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ)' కథనం ప్రకారం.. రూలింగ్ వర్కర్స్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ పాక్ జోంగ్ చోన్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు కిమ్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. "యుద్ధాన్ని నిరోధించడం, యుద్ధంలో పోరాడటం అనే రెండు కీలక బాధ్యతలను మన ఆర్టిలరీ సమర్థంగా నిర్వర్తించాలి. దీని కోసం అత్యంత విధ్వంసకర, బహుముఖ దాడి సామర్థ్యాన్ని కలిగి ఉండాలి" అని స్పష్టంచేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మించాలనే పార్టీ వ్యూహాత్మక విధానంలో ఆయుధ పరిశ్రమ కీలకపాత్ర పోషించాలని కిమ్ ఉద్ఘాటించారు. దాడి, రక్షణ ఆయుధాలలో కృత్రిమ మేధ (ఏఐ) స్థాయిని పెంచడం, ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి విధానపరమైన పనులను ఆయన నిర్దేశించారు. కిమ్ 600 ఎంఎం, 240 ఎంఎం మల్టిపుల్ రాకెట్ లాంచర్లు, డ్రోన్‌లను ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలను సందర్శించి ఉండవచ్చని సియోల్‌కు చెందిన కొరియా డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఫోరమ్ సెక్రటరీ జనరల్ షిన్ జోంగ్-వూ విశ్లేషించారు. కాగా దక్షిణకొరియా, అమెరికా, జపాన్ దేశాలు ఇటీవల నిర్వహించిన త్రైపాక్షిక సైనిక విన్యాసాలకు ప్రతిస్పందనగా సెప్టెంబర్ 14న ఉత్తర కొరియా క్షిపణి, ఫిరంగి దళాలతో భారీ ఫైర్‌పవర్ విన్యాసాన్ని నిర్వహించింది. ఈ విన్యాసంలో కొత్త రకం అటాక్ డ్రోన్లు, టాక్టికల్ క్రూయిజ్ క్షిపణులు, భారీ కాలిబర్ రాకెట్ లాంచర్లు, టాక్టికల్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ ఆయుధాలన్నీ తమ లక్ష్యాలను 100 శాతం కచ్చితత్వంతో ఛేదించాయని ఉత్తర కొరియా ప్రకటించుకుంది.

# మహిళలపై ఇంత కర్కశత్వమా?

**మొదటి తరువాయి**

ప్రజలు, రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మాత్రం అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒడిశాకు చెందిన ఓ పేద యువతిని ఎంపీ కొడుకు వాహనంతో ఢీకొట్టి చంపితే పోలీసులు మౌనం వహించారని మండిపడ్డారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల కుటుంబాలకు సంబంధించిన కేసుల్లో ఒక రకంగా, సామాన్య ప్రజలు లేదా రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు.

గూండాలకు పోలీస్ ఎస్కార్టా?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై దాడి చేయించేందుకు గూండాలను ప్రత్యేక తాళ్ల బృందాలతో పోలీసులు ఎస్కార్ట్ కల్పించారని కేటీఆర్ ఆరోపించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 7న అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, వారి జుట్టు, చీరలు లాగారని గుర్తుచేశారు. తమ పార్టీ నేత మన్నె క్రిశాంక్ అరెస్టు వ్యవహారంలో ఆయన బిడ్డను పాఠశాలకు వెళ్లకుండా అడ్డుకొని భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

చిన్నారులు, మహిళల రక్షణ విషయంలో పోలీసు వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. పోలీసు యూనిఫాం ధరించిన అధికారులు.. ప్రజలు, రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మాత్రం వీధి గూండాలకు ఏమాత్రం తీసిపోని విధంగా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పట్టపగలే హత్యలు జరుగుతున్నా, శాంతిభద్రతలు క్షీణించినా ప్రభుత్వం రాజకీయ అంశాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

**- హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పిటిషన్**
**- రేపు విచారణకు వచ్చే ఛాన్స్**



తెలంగాణ బ్యూరో : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత అంశంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానం పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. కాగా, దానం నాగేందర్ అనర్హత అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సుప్రీంకోర్టులో ముందుస్తుగా కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. దానం పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించినప్పుడు ఈ కేవియట్ పిటిషనర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు తెలిపారు. దీంతో దానం అనర్హత అంశం మరింత ఆసక్తిగా మారింది.

ఎన్నికల్లో కొట్లాడుతా..

అంతకుముందు శనివారం మధ్యాహ్నం హైకోర్టు తీర్పుపైన దానం నాగేందర్ మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మాట్లాడుతూ.. తాను సుప్రీంకోర్టుకు వెళ్లనని చెప్పారు. శుక్రవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని.. 'నీవు ఫైటర్వి కదా.. ఫైట్ చేద్దాం' అని సీఎం తనకు ధైర్యం చెప్పారని దానం తెలిపారు. తాను ఇప్పటికీ ఫైట్ చేస్తానని స్పష్టత ఇచ్చానని, కోర్టు తీర్పుపైన తాను మీడియాతో మాట్లాడనని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ఇచ్చింది స్పీకర్ నిర్ణయంపైన అని, పై కోర్టుకు వెళ్లాలంటే ఆయనే వెళ్లాలని, సుప్రీంకోర్టుకు వెళ్తారో లేదో స్పీకర్ నిర్ణయమని దానం అన్నారు. అయితే ఆ తదనంతరం దానం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం గమనార్హం.

# నడకుదురులో నూతన సీసీ రోడ్ల ప్రారంభం

**అభివృద్ధి, సంక్షేమానికి రూ.35.01 కోట్ల వ్యయం: ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కాకినాడ, సెప్టెంబర్ 19 (నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా కాకినాడ గ్రామీణ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్లను పరిశీలించి, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నడకుదురు గ్రామంలో ఫేజ్-1, ఫేజ్-2 కింద మొత్తం 33 సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులకు సుమారు రూ.2.29 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. నడకుదురు గ్రామంలో ఇప్పటివరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం సుమారు రూ.11.88 కోట్లు, ప్రజా సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.23.13 కోట్లు వెచ్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమం కోసం మొత్తంగా సుమారు రూ.35.01 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను దశలవారీగా మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు, బిరుద భాస్కర్ తమ్మయ్య, గొల్లపల్లి చంద్రశేఖర్, నల్లే ప్రసన్న, జోక తాతాజీ, దూడల నారాయుడు, మెండు గోవింద్, అబ్బిరెడ్డి శివన్నారాయణ, సింగంపల్లి నాగేశ్వరరావు, యాళ్ల పండు, ముమ్మిడి శాంత, దేవు వెంకన్న, యాసలపు దుర్గ ప్రసాద్, యాసలపు విష్ణుమూర్తి, చీపురుపల్లి జయేంద్రబాబు, మాసరరావు, పుణ్యమంతుల అన్నవరం, ముమ్మిడి పుష్పలత, అంజి, పాండ్రంకి రాజు, పంచాయతీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వేలంగిలో రూ.1.30 కోట్లతో 13 సీసీ రోడ్ల నిర్మాణం

**కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కాకినాడ, సెప్టెంబర్ 19 (నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా కాకినాడ గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కరప మండలం వేలంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వేలంగి గ్రామంలో ఫేజ్-1, ఫేజ్-2 కింద మొత్తం 13 సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.1.30 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. ఫేజ్-1 కింద రూ.50 లక్షల వ్యయంతో 4 సీసీ రోడ్లు, ఫేజ్-2 కింద రూ.79.20 లక్షల వ్యయంతో 9 సీసీ రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. అలాగే వేలంగి గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇప్పటివరకు సుమారు రూ.3.51 కోట్లు, ప్రజా సంక్షేమ పథకాల ద్వారా రూ.32.84 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా గ్రామానికి మొత్తంగా సుమారు రూ.36.35 కోట్ల మేర నిధులు అందించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టీడీపీ గ్రామీణ ఇన్‌చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పితాని లీల, బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు, పైడికొండల దుర్గాప్రసాద్, గరగ జమ్మి, మేడిశెట్టి సత్యనారాయణ (పండు), నల్ల దుర్గాప్రసాద్, జోక తాతాజీ, దూడల నారాయుడు, దేవు వెంకన్న, ఇమాన్యుల్, కంచి తేజ గణేష్, కుక్కల మురళి, చాపల శివ, సుంద్రు వెంకన్నరావు చౌదరి, వెలుగుల లచ్చరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి పురస్కారం అందుకున్న ఆచార్య డా. పద్మ ప్రియకు ఘన సన్మానం




**హైదరాబాద్ ( సెప్టెంబర్ 19) సెప్టెంబర్ 19 (నేటి దర్శిని)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు"ను అందుకున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు.

విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య డా. పద్మ ప్రియ ని అభినందిస్తూ శనివారం నాంపల్లి ప్రాంగణంలోని ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో జ్యోతిషం--వాస్తు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు , రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు , అకడమిక్ డీన్ డా. వనజా ఉదయ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆచార్య డా. పద్మ ప్రియ ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విద్యాబోధనతో పాటు తెలుగు భాష, సాహిత్యం, కళలు మరియు విద్యా రంగానికి ఆచార్య డా. పద్మ ప్రియ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆమెకు లభించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలి పురస్కారం విశ్వవిద్యాలయానికి, అధ్యాపక వర్గానికి, విద్యార్థులకు గర్వకారణమని అన్నారు. ఆచార్య డా. పద్మ ప్రియ మాట్లాడుతూ తనకు లభించిన ఈ పురస్కారం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తనతో కలిసి పనిచేసిన సహచర అధ్యాపకులు, విద్యార్థులు మరియు విశ్వవిద్యాలయ కుటుంబం అందరి ప్రోత్సాహానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభ్యున్నతి, విద్యా ప్రమాణాల పెంపు మరియు తెలుగు భాషా--సాంస్కృతిక రంగాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిషం--వాస్తు శాఖకు చెందిన ఎం.ఎ. జ్యోతిషం, పీ.జీ. డిప్లొమా ఇన్ జ్యోతిర్వాస్తు, డిప్లొమా ఇన్ జ్యోతిషం, సర్టిఫికెట్ కోర్సు ఇన్ జ్యోతిషం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొని ఆచార్య డా. పద్మ ప్రియ కి శుభాకాంక్షలు తెలిపారు

# విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ సుమతి**





**సెప్టెంబర్ 19 (నేటి దర్శిని) ,ఆర్కే పురం**
ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో లిమహా గణపతి 39వ నవరాత్రి మహోత్సవాల లో భాగంగా ఐదవ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ లిసుమతి, ఎల్బీనగర్ డిసిపి లిఅనురాధ, ట్రాఫిక్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ లిశ్రీనివాస్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జరిగిన లిసాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, అష్టలక్ష్మీ దేవాలయ ఛైర్మెన్ నాగమల్ల శ్రవణ్ కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య , ఉత్సవ కమిటీ కన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, చిలుక ఉపేందర్ రెడ్డి, గౌరిశెట్టి అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, గ్రాంది. శ్రీకాంత్, దండు రాజు, గౌరీ శంకర్, ఐతీ. రాంకిషన్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, కృష్ణ మూర్తి, రామ స్వామి, మేఘమాల, భ్రమరాంబ, రాధా తదితరులు పాల్గొన్నారు

# విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'.. లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు

**-విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం**

**-28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ**

**-పేదల ఇళ్ల కోసం 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ**

**-పట్టాలు అందించి ర్యాంప్ వాక్‌తో అలరించిన సీఎం చంద్రబాబు**

**-పంపిణీ చేసిన ఆస్తుల విలువ రూ.8,874 కోట్లు**



**విశాఖపట్నం,సెప్టెంబర్ 19 (నేటి దర్శిని)**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. క్రమబద్ధీకరించిన స్థలాలకు పట్టాలను లబ్ధిదారులకు అందజేత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది.

**లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన చంద్రబాబు...**

అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు

# "భూ"లావాదేవీలు ఉన్నవారే పార్టీ మారారు

**-మేనల్లుడు టీడీపీలో చేరడంపై వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ**

**-ఇటీవలే టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను**

**-స్వార్థపూరిత రాజకీయాలు చేసేవారు పార్టీకి అవసరం లేదన్న బొత్స**

**-నిబద్ధత కలిగిన కార్యకర్తలే వైసీపీకి అసలైన బలం అని వ్యాఖ్య**



**అమరావతి, సెప్టెంబర్ 19 (నేటి దర్శిని)**
పదవులు, భూ లావాదేవీలు, సొంత వ్యాపార ప్రయోజనాలలో మునిగితేలిన నాయకులే ఈ రోజు వైసీపీని వీడి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బొత్స చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి.

**భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నడిపిన వారే జంప్ అయ్యారు**

సమాజంలో గౌరవంగా ఉన్న ఏ ఒక్క నీతివంతమైన కుటుంబం కూడా తెలుగుదేశం పార్టీ వైపు చూడటం లేదని బొత్స అన్నారు. స్వార్థపూరిత లాలూచీ రాజకీయం చేసే వ్యక్తులు పార్టీకి అవసరం లేదని... ప్రజా సేవకే ప్రాధాన్యమిచ్చే గౌరవప్రదమైన కుటుంబాలు, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వైసీపీకి అసలైన బలం అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తమ ప్రభావాన్ని అడ్డుపెట్టుకుని భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నడిపిన వారే ఇప్పుడు స్వలాభం కోసం జంప్ అయ్యారని మండిపడ్డారు.

**స్వార్థపరులు వీడటం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం జరగదు**

రాజకీయాల్లో హెచ్చుతగ్గులు సహజమని, స్వార్థపరులు వీడటం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం జరగకపోగా, మరింత ప్రక్షాళన జరిగి నిజమైన నాయకత్వంతో బలోపేతమవుతుందని బొత్స ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడే ప్రతి సాధారణ కార్యకర్తకు, నాయకుడికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న ప్రజావ్యతిరేక పాలనతో ప్రజలు విసిగిపోయారని, రాబోయే రోజుల్లో వైసీపీ మళ్లీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తల కష్టాన్ని వృథా పోనివ్వమని, అందరినీ కలుపుకుని మళ్లీ ప్రజాదరణ పొందుతామని పిలుపునిచ్చారు


# అనారోగ్యంతో ఉన్న జనసేన నాయకుడి కుమారుడికి ఎమ్మెల్యే పంతం నానాజీ పరామర్శ



**కాకినాడ, సెప్టెంబర్ 19 (నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా కాకినాడ గ్రామీణ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బిరుద భాస్కర్ తమ్మయ్య కుమారుడు బాబు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పంతం నానాజీ శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాబును ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, వారి కుటుంబాలకు నాయకత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## నాని 'ది ప్యారడైజ్' సినిమాలో

# 'పొడుస్తున్న పొద్దుమీద'?



నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మాస్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేయగా, తాజాగా మ్యూజికల్ ఫీస్ట్‌కు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతంలో రాబోతున్న పాటల జాబితా నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ గీతంగా కోట్లాది మంది ప్రజల హృదయాలను హత్తుకున్న ప్రసిద్ధ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అమూల్యమైన గీతం 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా...' పాటను ఈ సినిమాలో ఉపయోగిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలతో పాటు ఈ ఐకానిక్ ఫోక్ సాంగ్ కూడా సినిమాలో చోటు చేసుకుంటే, థియేటర్లలో ప్రేక్షకుల ఊపు చూసి థియేటర్లు ఊగిపోవడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. అనిరుధ్ మ్యూజిక్, శ్రీకాంత్ ఓదెల టేకింగ్, నాని మాస్ పెర్ఫార్మెన్స్‌కు తోడు ఈ ఫోక్ సాంగ్ తాలుక వైబ్స్ తోడైతే సిల్వర్ స్క్రీన్ మీద రికార్డులు తిరగరాయడం పక్కా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై చిత్రయూనిట్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇవి కేవలం రుమర్స్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## 'జైలర్ 2' నుంచి అదిరిపోయే అప్‌డేట్.. విలన్‌గా మలయాళ స్టార్ ఎంట్రీ!




సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ప్రమోషన్స్‌ను అధికారికంగా ప్రారంభించిన చిత్ర బృందం, చిత్రంలోని కీలక నటీనటుల పాత్రలను పరిచయం చేసే రోల్‌అవుట్‌ను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా విడుదలైన మొదటి క్యారెక్టర్ ప్రోమోలో మలయాళ స్టార్ నటుడు సూరజ్ వెంజరమూడు పాత్రను మేకర్స్ రివీల్ చేశారు. ఈ చిత్రంలో సూరజ్ వెంజరమూడు 'దిలీప్' అనే అత్యంత పవర్‌ఫుల్ మరియు ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. విడుదల చేసిన 35 సెకన్ల క్యారెక్టర్ ప్రోమోలో ఆయన కారు దిగి సిగార్ కాలుస్తూ చాలా స్టైలిష్‌గా, భయంకరమైన లుక్‌లో అందరినీ ఆకట్టుకున్నారు. అనిరుధ్ రవిచందర్ అందించిన కేరళ డ్రమ్స్ మిక్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ పాత్ర ఎంట్రీకి భారీ హైప్‌ను తీసుకువచ్చింది.ఈ ప్రోమోలో ఆయన పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను సస్పెన్స్‌గా ఉంచినప్పటికీ, ఆయన లుక్ మరియు మేనరిజమ్స్ చూస్తుంటే ముత్తువేల్ పాండియన్ పాత్రను ఢీకొట్టే ప్రధాన విలన్‌గా లేదా ఒక బలమైన యాంటీ హీరోగా కనిపించబోతున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మొదటి భాగంలో వినాయకన్ పోషించిన వర్మన్ పాత్ర ఎంతలా సంచలనం సృష్టించిందో, ఈ సీక్వెల్‌లో సూరజ్ పాత్ర అంతకంటే పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రంలో రమ్యకృష్ణన్, యోగిబాబు, మీర్నాలు తమ మొదటి భాగంలోని పాత్రలను కొనసాగిస్తుండగా, వీరితో పాటు మిథున్ చక్రవర్తి, ఎస్.జె. సూర్య, విద్యాబాలన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగం కానున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని అంచనాలను తలకిందులు చేస్తూ 'జైలర్ 2' చిత్రం 2026 అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## రా అండ్ రస్టిక్ గా

# ఆశిష్ గాంధీ 'డానీ'.

### అంచనాలు పెంచుతున్న ఫస్ట్ స్ట్రైక్ గ్లింప్స్!




టాలీవుడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించేందుకు మరో రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోంది. ఆశిష్ గాంధీ హీరోగా, కళ్యాణ్‌జీ గోగణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'డానీ'. రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్లపై రిజ్వాన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'ఫస్ట్ స్ట్రైక్' టీజర్ తాజాగా విడుదల కాగా, సినిమాపై అంచనాలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. టీజర్ ఆరంభంలోనే "నువ్వు బీచ్‌కి ఎప్పుడూ ఒంటరిగా వస్తావా?" అని హీరోయిన్ అడిగే ప్రశ్నకు, హీరో చెప్పే బోల్డ్ ఆన్సర్ యూత్ ఆడియెన్స్‌ను ఇన్‌స్టంట్‌గా కనెక్ట్ చేసేలా ఉంది. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో కేవలం రొమాన్స్ మాత్రమే కాకుండా, థ్రిల్ గొలిపే యాక్షన్ సన్నివేశాలకు కూడా పెద్ద పీఠ వేసినట్లు స్పష్టమవుతోంది. బీచ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్, నటీనటుల గ్లామర్ అప్పీల్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇప్పటికే దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ, హీరో ఆశిష్ గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన 'నాటకం', 'కళింగ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించాయి. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టడానికి 'డానీ'తో వస్తుండటంతో సినీ వర్గాల్లోనూ మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టెక్నికల్ పరంగా కూడా 'డానీ' ఫస్ట్ స్ట్రైక్ అత్యున్నత ప్రమాణాలతో నిలిచింది. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, కలర్ ఫుల్‌గా ఉంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా బీజీఎం అదరగొట్టింది. ఖుషి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి మణికాంత్ ఎడిటర్‌గా, రామ్ సుంకర, కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రాఫర్లుగా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను మేకర్స్ విడుదల చేయనున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి అక్టోబర్ నెలలో ఈ సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. రా అండ్ రస్టిక్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ 'డానీ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!

## అనుకున్న సమయానికి కష్టమేనా?



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ వార్ డ్రామా 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజా పరిణామాలను గమనిస్తే ఈ ఏడాది 'ఫౌజీ' విడుదల అసాధ్యమనే టాక్ వినిపిస్తున్నది. బ్యాలెన్స్‌గా ఉన్న వర్క్ కారణంగా ఈ సినిమా డిసెంబర్ బరి నుంచి తప్పుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన రెండు భారీ యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించాల్సి ఉంది. వీటికి 40రోజుల కాల్‌షీట్లు అవసరమని చెబుతున్నారు. దీనితో పాటు కొంత ప్యాచ్ వర్క్ కూడా మిగిలి ఉండటంతో మొత్తంగా 50రోజులకుపైగా షూటింగ్ అవసరం ఉంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న 'ఫౌజీ' రిలీజ్ కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న ఈ సినిమా ప్రేక్షకులముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అయితే ఇవి కేవలం ఊహాగానాలేనని, ముందస్తు ప్రకటించిన తేదీనే సినిమా విడుదలవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.






# మగవాళ్ళకి కూడా పీరియడ్స్ రావాలి..

### శ్రుతిహాసన్ సెన్సేషనల్ కామెంట్స్

సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు శ్రుతి హాసన్. విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె.. నటిగా మాత్రమే కాకుండా సింగర్‌గానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. అయితే తాజాగా శ్రుతి హాసన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని బయటకు చెప్పడానికి తాను పడిన ఇబ్బందుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రుతి హాసన్.. తన వ్యక్తిగత అనుభవాలను ఓపెన్‌గా పంచుకుంది. తనకు ౹ాజూరా సమస్య ఉండటంతో పీరియడ్స్ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపింది. చిన్నప్పటి నుంచే పీరియడ్స్ తనకు చాలా బాధాకరంగా ఉండేవని చెప్పిన శ్రుతి.. కొన్ని సందర్భాల్లో విపరీతమైన నొప్పితో పాటు వాంతులు చేసుకోవడం, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు కూడా ఎదురయ్యాయని తెలిపింది. కొన్నిసార్లు పరిస్థితి తీవ్రంగా మారడంతో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని తన అనుభవాలను వివరించింది. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్య తనకు మరింత ఇబ్బందికరంగా మారిందని శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది. ముఖ్యంగా షూటింగ్ సమయంలో యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొనేటప్పుడు కడుపునొప్పి తీవ్రంగా ఉన్నప్పటికీ.. ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేక చాలా ఇబ్బంది పడేదానినని తెలిపింది. తనకు ఏదైనా సమస్య ఉందని చెప్పడం కంటే.. దాన్ని దాచుకోవడమే మంచిదని అప్పట్లో భావించేదానినని చెప్పింది. అయితే అలా తన సమస్యను దాచుకోవడం వల్ల తాను ఎందుకు డల్‌గా, ఎనర్జీ లేకుండా కనిపిస్తున్నాననే విషయం చుట్టుపక్కల వారికి అర్థం కాకపోయేదని పేర్కొంది. అయితే ఒకసారి తనతో కలిసి పనిచేస్తున్న ఓ ఆర్టిస్ట్‌కు సర్జరీ జరగడంతో అతని పరిస్థితిని మేకర్స్‌కు వివరించగా.. వారు అతనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారని శ్రుతి తెలిపింది. అంతేకాదు, అతనికి ఇబ్బంది కలగకుండా షూటింగ్ సమయాలను సైతం మార్చారని చెప్పింది. ఆ సంఘటనను చూసిన తర్వాత తాను కూడా తన సమస్యను మేకర్స్‌కు చెబితే వారు అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందని తెలిపింది. ఆ తర్వాత ఓ దర్శకుడికి తన పీరియడ్స్ సమస్య గురించి చెప్పానని, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చింది. ఆ దర్శకుడికి కూడా కుమార్తె ఉండటంతో తనకు మరింత ధైర్యం వచ్చిందని వెల్లడించింది. అప్పటి నుంచి తన సమస్యను దాచుకోకుండా అవసరమైనప్పుడు ఓపెన్‌గా చెప్పడం ప్రారంభించానని శ్రుతి హాసన్ పేర్కొంది. ఇదే సందర్భంలో శ్రుతి హాసన్ మగవాళ్లపై సరదాగా సెటైరికల్ కామెంట్ చేసింది. మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని ఆమె వ్యాఖ్యానించింది. అలా జరిగితే హీరోయిన్లతో కుదుర్చుకునే కాంట్రాక్టుల్లో పీరియడ్స్ విషయాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించి.. వారికి హాలిడేస్ ఇచ్చేవారేమో అంటూ సరదాగా చెప్పింది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450